


"నెలచివర్లో రెండువందలు పెట్టి చీరెలు కొంటావా? నలుగురు బిడ్డల తల్లి వయ్యావ్. కొంచెమైనా యింగితం వుండక్కర్లా?" శేఖరం భార్య వైపు కోపంగా చూశాడు.

అందరూ కొంటూ వుంటే....

"అందరూ కొంటూవున్నారని కొనెయ్యడమే. మన మేమిటో మన స్థితిగతు లేమిటో ఆలోచించక్కర్లేదూ" శేఖరం భార్యవైపు చిరచిరలాడుతూ, చూశాడు.

ఉన్నవాళ్ళతో నేను పోటీపడలేదండీ. రోజంతా పనిచేసి, ఐదు రూపాయలకన్న అధికంగా గడించలేని మనిషి వందరూపాయలుపెట్టి రెండు వెంకటగిరి చీరెలు నా కళ్ళముందు కొంటూవుంటే, వెయ్యి రూపాయల ఉద్యోగస్థుడి భార్యను, ఆ మనిషిముందు తేలికపడమా, అని వెనకముందు ఆలోచించకుండా రెండు వందలు పెట్టి నేను రెండు పట్టుచీరెలు కొన్నాను. ఆ మనిషి చీరెలు కొన్నందుకు కాదు. వంద రూపాయల నోటు కట్టల మూట వాడివైపు విసిరిన, ఆ పొగరైన తీరుచూసి....

"ఆ మనిషెక్కడిదో చీకటిజీవితంతో సంపాదించివుంటుంది. అలాంటివాళ్ళకు డబ్బు విలువ ఎలా తెలుస్తుంది? శేఖరం చిరాగ్గా భార్యవైపు చూశాడు.

"మీరు అనుకోకుండా అప్పుడప్పుడు కొన్ని మాటలంటూవుంటారు. అవి అక్షరాలా నిజమౌతాయండీ. యీ మధ్య అందరూ ఆ మనిషి గురించి, నానారకాలుగా అనుకుంటూవున్నా నేను నమ్మలేదు.

లోకులు కాకులు కదండీ. అందుకే నేను అంతగా వాళ్ళ మాటలను పట్టించుకోలేదు. యీరోజు నా కళ్ళతో చూశాను. ఆ మనిషి ఉనికిలోనే మార్పు వచ్చింది. ఎవ్వరో పెద్ద ఆఫీసరట రాత్రి తొమ్మిది దాటిన తర్వాత. ఆ మనిషి గదిలో దూరుతారట. మొన్నరాత్రి నేనూ చూశాను. ఒక వ్యక్తి కంగారు, కంగారుగా ఆ గదిలోకి వెళ్ళడం, మీకు చూపిద్దామనుకొన్నాను. యీ మధ్య మీరు ఆఫీసునుండి యింటికి వచ్చేసరికి పది దాటుతుంది. అందువల్ల పిలవడం లేదు.

"ఇంతకు ఎవ్వరా మనిషి" శేఖరం తడబడుతూ భార్యవైపు చూశాడు.

"మీకు తెలుసండీ" సుశీల మెత్తగా నవ్వింది.

"నాకు తెలుసా" శేఖరం సన్నగా కంపిస్తూ భార్యవైపు చూశాడు.

'మీకు తెలుసంటే, అలా తెల్లబోతారేమిటండీ, తెలియడమంటే. ఆవిడతో మీకు పరిచయం వుందనీ, ఆవిడ చరిత్ర మీకు తెలుసనీ కాదు. మనయింటి ఎదురుగా వున్న ఆ చిన్నగదిలోకి, ఐదారు నెలల క్రితం ఒక యిరవై అయిదు సంవత్సరాల విధవ వచ్చి చేరింది. ఆవిడకు యిద్దరు పిల్లలు, ఒక ముసలితల్లీ వున్నారు. బట్టలు కుట్టి జీవిస్తారు. జీవితం గడపడం చాలా కష్టంగా వుందని, ఆ ముసలావిడ నాతో చాలాసార్లు అంది ఆ విషయం నిజమే. ఆ గదిలోకి వచ్చిన క్రొత్తలో ఒకపూట తినీ, ఒకపూట తినకా కాలం గడిపారు. మూడు నెలలనుండి మనుష్యుల్లో చాలా మార్పువచ్చింది. నెలకు రెండు వెంకటగిరి చీరెలు కొనేస్థితికి వచ్చారు....అదేమిటండీ మీరలా కొయ్యబారిపోయారు? ఆ బజారుమనిషితో పోటీపడి నెలకు రెండు పట్టుచీరెలు నేనూ కొంటాననుకున్నారా? నేను నలుగురు బిడ్డలకు తల్లిని. పిచ్చి వ్యామోహాలల్లో పడి సంసారాన్ని రచ్చకీడుస్తానా? యీ మధ్య మీ ఖర్చుకూడా మూడువందలు దాటిపోయిందండీ ఆఫీసరన్న తర్వాత, ఫ్రెండ్స్ అనీ, అవనీ యివనీ ఖర్చులుంటాయనుకొండి. మనం నలుగురు పిల్లలకు తల్లిదండ్రులం. మీరుకూడా యిక నుండి కొంచెం ఖర్చు తగ్గించుకోవడానికి ప్రయత్నించండి' అతి వినయంగా భర్తతో చెప్పి తన పనిలో మునిగిపోయింది సుశీల.

ఆ తర్వాత శేఖరం నెల ఖర్చు పాతిక దాటలేదు.

ఎదురింటి విధవ ఎందుకల్లనో వెంకటగిరి చీరెలు కొనడం మానివేసింది.

